మూర్తిని ప్రత్యేకంగా అహ్వానించాను. కొంత బాతాఖానీ అయిన తరువాత కాంతం చిత్రించిన దృశ్యాలు కొన్నిచూచి తనుకూడా చిత్రకారుడే గనక అనందించగలడనే కుతూహలంతో మూర్తికి కొన్ని చిత్రాలుతెచ్చి చూపించాను. వాటిలో ఒకదృశ్యాన్ని మూర్తీ తదేకదృష్టితో చూస్తున్నాడు. తలవంచి వుండడంచేత అతని ముఖచిహ్నాలు గ్రహించలేక పోయాను. ఐదు నిమిషాల తరువాత పటంమీద నీటిబొట్లు పడడం గ్రహించాను. వెంటనే మూర్తిని భుజం మీద తట్టి ‘ యేమిటి సంగతని” ప్రశ్నించాను. సమాధానంలేదు. రెండు నిమిషాల తర్వాత మూర్తి విషాదవదనంతో అడిగాడు “నాకోరికొకటి తీరుస్తావా రాజూ” అని “తప్పక తీరుస్తా” నన్నాను.

“యీ చిత్రకారిణిచేత మంత్ర పుష్పం చదివించి వినిపిస్తావా” అన్నాడు. నా కాశ్చర్యం వేసింది. మా కాంతం మంత్రపుష్పం చదవగలదని మూర్తికెలాతెలుసా అని సరే ప్రశ్నలకిది సమయంకాదని మా కాంతాన్నిపిలిచి మా స్నేహితుడికోర్కె తెలియచేశాను మూర్తీ కళారాధకుడనీ నీవేమీ సందేహించవద్దనీ నచ్చచెప్పాను. మూర్తీపేరు వినడంతోనే మా కాంతం ముఖంలో ఆశ్చర్యం ద్యోతకమైంది కాని ఆభావం వెంటనే సంబాళించుకొని ముందెన్నడూలేని చురుకుదనంతో చదివిందీ సారి. వింటున్నంతసేపూ మూర్తి తన్మయుడై అనందంలో మునిగితేలాడు. పూర్తి కాగానే మారు మాటాడకుండా సెలవు తీసుకొని బయలుదేరాడు.

పనులన్ని ముగించుకొని పడకగది చేరింది కాంతం, పటాల్లో ఒకదాన్ని మూర్తీ తదేకదీక్షతోచూడ్డం, కన్నీరుకార్చడం యివన్నీచెప్పి “అసలు సంగతేమిటి కాంతం” అని ప్రశ్నించాను. “అదంతా యిప్పుడెందుకు లెండి” అన్నది. “పర్వాలేదు చెప్పు” అని బలవంత పెట్టగా చెప్పడం అరంభించింది. తనూ మూర్తీ ఒకస్కూల్లోనే చదువుకున్నామనీ చిన్నప్పుడిద్దరూ అమిత స్నేహంగావుండే వారమనీ తాను వ్రాసిన చిత్రపటాలను మూర్తీ చాలా మెచ్చుకుంటూ వుండేవాడనీ అందులో ప్రత్యేకంగా ఆ (కన్నీటికి కారణమైన) పటం రోజు కొకసారైనా చూడకుండా వుండేవాడు కాదనీ, తల్లిదండ్రుల విముఖతవల్ల తమకు కావలసిన వివాహం జరుగలేదనీ చెప్పింది నా కప్పుడర్థమైంది మూర్తీకి అప్పుడప్పుడూ పొడసూపే విషాదానికి కారణం.

మరునాడుదయమే మూర్తి యింటికి వెళ్ళాను. గది ఖాళీ ఆరాత్రే ఖాళీచేసి యెక్కడికో వెళ్ళిపోయాడని మాత్రం తెలిసింది.

విన్నకోట కోటిలింగేశ్వరరావు

* * *

## వృక్షరాజెవరు?

ఒక అడవియందొక వటవృక్షము, టేకు వృక్షము స్వేచ్ఛాజీవనము చేయుచుండెడివి. ఒకనాడు వటవృక్షము టేకుచెట్టును చూచి “టీకా! నీది కొరగాని బ్రతుకు సుమా! పరోపకారములేని నీవ్యర్థజీవనంబేల? నేను వేసవిలో వేలకొలది ప్రజలకు నీడనిచ్చి కాపాడెదను. శరణార్థులై ఎన్నో పక్షులువచ్చి నాకొమ్మలపై తలదాచుకొనును. శిబి, కర్ణాదులవలె నాజన్మసార్థకమైనది. వృక్షరాజైన నాతో నీకు సాటియా?” అని సగర్వముతో పలికెను.

టేకు వృక్షము ఆ పలుకులువిని “ఒ మఱ్ఱీ! యేల యీ ప్రగల్భములు? నీవు బ్రతికియుండి తాత్కాలికపు నీడనిచ్చెదవు. గాని నేను ప్రజాసేవకై మరణించి, కలపయై, ప్రజాభవనము లందుండి గాలివానలకు ఎండలకు ప్రజలు తూలిపోకుండ కాపాడెదను. కుర్చీలు, బల్లలు, మంచములు మొదలగు అవతారంములు దాల్చి ప్రజాసేవ చేయుచుందును. ‘జగమెరిగిన బాపనునకు జందెంబేల’ అనురీతిని జగద్విఖ్యాతిగల నేను నా ఔన్నత్యము చాటనేల? బడుగు దేహముతో యేరోడ్డు ప్రక్కనే పడియుండక ఊరకనాతో ఈ తగవులేల? గాలిదేవుడున్నాడు జాగ్రత్తా!” అనెను.

వటవృక్షము మౌనము దాల్చెను. వృక్షరాజెవరో నను సందియము కలిగినది.

జగడ గొండులకు ‘పరాభవము తప్పదు శాంతి పరులకు సర్వదా సౌఖ్యమబ్బును.

మరువాడ సూర్యప్రకాశం.

* * *


## కావలెను -

ఈ క్రింది పట్టణములకు మా చిత్రగుప్తను విక్రయించుటకు ఏజంట్లు కావలెను. రు 15 లు డిపాజిట్ తప్పని సరిగ చెల్లించేవారుగ నుండవలెను.

1 సామల్‌కోట, 2 సోంపేట, 3 ఉయ్యూరు, 4 తాడేపల్లిగూడెం, 5 ఆదోని, 6 బాపట్ల, 7 కల్యాణదుర్గం, 8 తణుకు, 9 ఛత్రపూరు, 10 ప్రొద్దుటూరు, 11 కుప్పం, 12 కాళహస్తి, 13 పుత్తూరు, 14 కదిరి, 15 నరసపూర్, 16 ఖమ్మంమెట్టు.